హాస్టళ్లల్లోనూ అపరిశుభ్రతే!

నిబంధనలు పాటించని వారిపై ఫుడ్ సేఫ్టీ చర్యలు

సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారస్తులపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రుచికి, శుభ్రతకు పెట్టింది పేరు అంటూ ఉదరగొట్టే పెద్ద పెద్ద పేరు మోసిన హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లలో బండారాలు బయటపడుతున్నాయి. కుళ్లిపోయిన మాంసం, ఎక్స్‌పైరీ డేట్ దాటిన ప్రొడక్ట్, కల్తీ మసాలాలు, ఏ మాత్రం నాణ్యత లేని పదార్థాలను వాడటమే కాకుండా.. అపరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని సిద్ధం చేస్తున్నట్లు తనిఖీల్లో అధికారులు గుర్తించారు. తాజాగా, హాస్టళ్లలోనూ ఫుడ్ సేఫ్టీ రూల్స్ కూడా సరిగా పాటించడం లేదని అధికారులు వెల్లడించారు. మాదాపూర్‌లో శ్రీలక్ష్మీ పీజీ హాస్టల్, వీజీ హోం స్టే హాస్టల్‌లో అడుగడుగునా.. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించారు. ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. ముఖ్యంగా ఆహారంలో రంగుల వాడకం, దోస తవ్వ(నం) తుప్పు పట్టినట్లు పరిశీలించారు. కూరగాయలు అపరిశుభ్రంగా ఉండటం, పనిచేసే కార్మికులు నెత్తిన ఎలాంటి క్యాప్ ధరించలేదని, వంటల్లో వాడే కారం పొడి కల్తీ జరిగినట్లు గుర్తించారు. నారాయణ మెడికల్ అకాడమీలో ఫుడ్ లైసెన్స్ లేకపోవడం, అపరిశుభ్రత వాతావరణంలో తాగునీటి సౌకర్యం, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, వంటగదిలో అపరిశుభ్రత ఉన్నట్లు గుర్తించి.. సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నారు.

మత్తులో ద్విచక్ర వాహనదారులు

ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్

ఒకేరోజు 253 మంది పట్టివేత

సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ): నగరంలో ద్విచక్రవాహనదారులు మత్తులో తూగుతున్నారు. మత్తులో తూలుతున్న వీరు ఏ డివైడర్‌నో, ఏ బ్రిడ్జినో ఢీకొట్టడం.. లేదా ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ప్రమాదాల్లో మద్యం మత్తులో వాహనాలు నడిపే వారే కాకుండా, వారి కారణంగా ఏ పొరపాటు లేని ఇతర వాహనదారులు, పాదచారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం డ్రంక్ అండ్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. అయితే, ప్రభుత్వం ఎన్ని కఠిన నిబంధనలు పెట్టినా, జైలు శిక్షలు వేసినా కూడా మందుబాబుల ప్రవర్తనలో మాత్రం ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదు. ప్రతి రోజు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 80 శాతం మరణాలు డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగానే జరుగుతున్నాయి. దీనిపై అటు పోలీసులు, ఇటు సామాజిక వేత్తలు ఎంత ప్రచారం చేసినా, అవగాహన కల్పించినా ఫలితం లేకుండా పోతోంది. ఈ క్రమంలోనే ఈ నెల 15న ఒకే రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు.. ఎనిమిదిన్నర గంటల్లో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మొత్తం 349 మంది పట్టుపడ్డారు. అందులో 253 మంది ద్విచక్రవాహనదారులే ఉండటం గమనార్హం. అయితే, పట్టుబడిన వారిలో 21- 30ఏండ్ల వయస్సు వారే అధికంగా ఉన్నారని, ఆ తరువాత స్థానంలో 31-40ఏండ్ల వయస్సు వారు ఉన్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ వెల్లడించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

వాహనాల వారీగా మద్యం మత్తులో పట్టుబడిన వారి వివరాలు..	
ద్విచక్రవాహనదారులు	253
త్రిచక్ర వాహనదారులు	16
ఫోర్‌వీలర్స్	74
భారీ వాహనదారులు	6
పట్టుబడిన వారిలో పురుషులు	346
మహిళలు	3

కేబుల్ బ్రిడ్జి వద్ద యువతి ఆత్మహత్యాయత్నం

కాపాడిన పెట్రోలింగ్ ట్రాఫిక్ పోలీసులు

మాదాపూర్, జూన్ 17: గుర్తు తెలియని ఓ యువతి నిద్రమాత్రలు వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు ఆ యువతిని కాపాడి.. సమీపంలోని దవాఖానకు తరలించి వైద్యం అందించారు. ఈ ఘటన సోమవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని ఓ యువతి (25) మాదాపూర్ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి వద్దకు వచ్చింది. నడక దారిలో ఆత్మహత్య చేసుకునేందుకు నిద్ర మాత్రలు వేసుకొని.. బ్రిడ్జి పైనుంచి దూకేందుకు వెళ్తూ.. ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలిపోయింది. అక్కడే ఉన్న పెట్రోలింగ్ ట్రాఫిక్ పోలీసులు గమనించి.. ఆ యువతిని సమీపంలో ఉన్న దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ఆ యువతి ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేదని దవాఖాన వైద్యులు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పలువురు డీసీపీలు బదిలీ

సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న పలువురు డీసీపీలను బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత, పార్లమెంట్ ఎన్నికల కోడ్ సమయంలో కూడా ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. తాజాగా మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో జంట పోలీస్ కమిషనరేట్లకు చెందిన డీసీపీలు కూడా ఉన్నారు.

- హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తున్న సుబ్బారాయుడు బదిలీ కాగా, ఆయన స్థానంలో సూర్యపేట ఎస్పీ రాహుల్ హెగ్డేను నియమించారు. సుబ్బారాయుడిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.
- టాస్క్‌ఫోర్స్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్‌ను బదిలీ చేస్తూ.. ఆమెను సిటీ నార్త్‌జోన్ డీసీపీగా నియమించారు. నార్త్‌జోన్ డీసీపీగా పనిచేస్తున్న రోహిణి ప్రియదర్శినిని 7వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు.
- సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీ జానకీ దరావత్‌ను మహబూబ్‌నగర్ ఎస్పీగా బదిలీ చేశారు.
- బాలానగర్ జోన్ డీసీపీ టి.శ్రీనివాస్‌రావు జోగులాంబ గద్వాల్ జిల్లా ఎస్పీగా బదిలీ కాగా.. ఆయన స్థానంలో కె.సురేశ్ కుమార్‌ను నియమించారు.
- శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డిని వికారాబాద్ జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎస్ఐబీ ఎస్పీ బి.రాజేశ్‌ను నియమించారు. వికారాబాద్ ఎస్పీగా పనిచేస్తున్న ఎన్.కోటిరెడ్డిని మేడ్చల్ డీసీపీగా బదిలీ చేశారు.

హోటల్ పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య

మాదాపూర్, జూన్ 17: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ కథనం ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన సాయి (29) సివిల్స్ ప్రిలిమ్స్ రాసేందుకు శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చాడు. ఈ నేపథ్యంలో మరుసటి రోజు సివిల్స్ పరీక్ష రాసిన అనంతరం స్నేహితులతో కలిసి మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని ఓయో రూంలోకి వెళ్లారు. ఆ తర్వాత హోటల్ భవనం 6వ అంతస్తు పైనుంచి దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. అతడితో పాటు ఉన్న మిగతా నలుగురు స్నేహితులపై అనుమానం వ్యక్తం చేస్తూ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా.. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, పూర్తి వివరాలు తెలిసిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రాయదుర్గంలో 9 మంది బైక్ రేసర్ల అరెస్టు

శేరిలింగంపల్లి, జూన్ 17: అర్ధరాత్రి రహదారులపై బైక్ రేసింగ్‌కు పాల్పడుతూ.. భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్న తొమ్మిది మందిని రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. ఇన్స్పెక్టర్ వెంకన్న కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి నాలెడ్జిసిటీ టీ హబ్ ప్రాంతంలోని రహదారుల్లో బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్ మొబైల్, పోలీసు సిబ్బంది బైక్ రేసర్లను పట్టుకునేందుకు వెళ్లారు. బైక్‌లతో స్టంట్స్ చేస్తూ.. ఇష్టం వచ్చినట్లు కేకలు వేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్న వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైకి దూసుకొచ్చారు. తప్పించుకున్న పోలీసులు.. రేసర్లను అడ్డుకునేందుకు స్టాపర్లను ఏర్పాటు చేశారు. దీంతో కొందరు రేసర్లు పరారు కాగా.. మరికొందరు వాహనాలను వదిలి తప్పించుకొని పారిపోయారు. వాహనాల ఆధారంగా సోమవారం తొమ్మిది మంది నిందితులను రాయదుర్గం పోలీసులు గుర్తించి, అరెస్టు చేశారు.

భార్యతో గొడవపడి.. బలవన్మరణం

మేడ్చల్, జూన్ 17: భార్యతో గొడవపడి భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన సంతోష్(25) భార్యతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం సంతోష్ తన భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయి, రెడ్డి శ్మశాన వాటిక సమీపంలో ఉన్న ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గచ్చిబౌలి కిడ్నాప్ కేసులో మరో నిందితుడి అరెస్టు

శేరిలింగంపల్లి, జూన్ 17: ఆర్థిక లావాదేవీల్లో తలెత్తిన వివాదంలో వరుసకు బావను బావమరిది కిడ్నాప్ చేసిన ఘటనలో మరో నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితులైన గౌతం, అశోక్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తును సీరియస్‌గా తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఈ కేసులో మరో నిందితుడు నరేశ్‌ను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను సైతం పట్టుకునేందుకు ముమ్మరంగా గాలిస్తున్నారు.

నగరంలో ప్రశాంతంగా బక్రీద్ పండుగ

సిటీబ్యూరో, జూన్ 17(నమస్తే తెలంగాణ): నగరంలో బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగింది. ట్రై పోలీస్ కమిషనరేట్ల పోలీసులు ఆయా ప్రాంతాల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మీరాలం ట్యాంక్ ఈద్గా, మాసబ్ ట్యాంక్‌లోని హాకీ గ్రౌండ్, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు ముగిసే వరకు ట్రాఫిక్‌ను మళ్లించారు. నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్‌సింగ్‌మాన్, కార్ హెడ్ క్వార్టర్స్ అదనపు సీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్, సౌత్ జోన్ డీసీపీ స్నేహా మెహ్రా తదితర అధికారులు ఓల్డ్‌సిటీలో పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

మేడ్చల్, జూన్ 17 : కుటుంబ కలహాలతో ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని ఎరుకల బస్తీకి చెందిన మధుసూదన్‌కు 2005లో శివలక్ష్మి(36)తో వివాహం జరిగింది. మూడేండ్ల పాటు సజావుగా సాగిన వీరి కాపురంలో కలతలు మొదలయ్యాయి. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు. మద్యంకు బానిసైన మధుసూదన్ తరచూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. పెద్దల సమక్షంలో పంచాయతీలు పెట్టినా మారలేదు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో విసిగిపోయిన శివలక్ష్మి మేడ్చల్ పెద్ద చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడింది. సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో నుంచి మృతదేహాన్ని బయటికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి

మారేడ్‌పల్లి, జూ న్ 17: రైలు పట్టాలు దాటుతుండగా ఓ వ్యక్తిని రైలు ఢీ కొట్టడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ డబిల్‌పూర్ ప్రాంతానికి చెందిన పవన్ కుమార్ (21) ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లి.. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మేడ్చల్ డబిల్‌పూర్ ప్రాంతంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలు దాటుతుండగా..

కాచిగూడ, జూన్ 17: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం.. గు ర్తు తెలియని వ్యక్తి (35) సోమవారం ఉప్పుగూడ - యాకత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియాకు తరలించారు. మృతుడు నీలి రంగు ప్యాంట్, కాకి రంగు చొక్క ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు.

మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో..

గుర్తుతెలియని వ్యక్తి (30) ఆదివారం అర్ధరాత్రి మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఆకుపచ్చ రంగు చొక్క, బూడిద రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 87125 68495లో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నంబర్ -10లో ఉన్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గుర్తించి, గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. అనారోగ్యంతో ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తికి ఫిట్స్‌తో రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫారం నంబర్ 10లో మృతి చెందాడు. ప్రయాణికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 45- 50 ఏండ్లు ఉంటాయని, ఒంటిపై ఎరుపు రంగు టీ షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ దందాపై టీనాబ్ నిఘా

12 మందికి మూత్ర పరీక్షలు

డీజేతోపాటు మరో ఇద్దరికి పాజిటివ్.. కేసు నమోదు

డ్రగ్స్‌పై సమాచారమివ్వండి

సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ క్రయ విక్రయాలపై తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో (టీనాబ్) పెట్టిన నిఘాలో ఒక డీజేతో పాటు 16 మంది పట్టుబడ్డారు. వారికి మూత్ర పరీక్షలు నిర్వహించడంతో డీజేతో పాటు మరో ఇద్దరు కొకైన్, గంజాయి సేవించినట్లు తేలింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. సైబరాబాద్ పరిధిలోని పబ్‌లపై నిఘా పెట్టడంతో ఒక డీజే మాదాపూర్, గచ్చిబౌలిలోని పబ్‌లలో డ్రగ్స్ తీసుకుంటున్నట్టు గుర్తించారు. దీంతో డీజే కదలికలను ట్రాక్ చేయడంతో 16 మందితో డ్రగ్స్ సంబంధాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో ఇందులో 12 మందికి మూత్ర పరీక్షలు నిర్వహించడంతో.. డీజేతో సహా ఇద్దరు డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్ రిపోర్టు వచ్చింది. దీంతో ఎన్డీపీఎస్ చట్టం కింద వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు టీజీనాబ్ డైరెక్టర్ వెల్లడించారు. డ్రగ్స్‌ను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న డ్రగ్ నిరోధక కమిటీలకు (ఏడీసీఎస్) అనుమానం వస్తే స్థానిక పోలీసులకు, యాంటీ నార్కోటిక్ బ్యూరోకు సమాచారమివ్వాలని సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. బ్యాగులు, లాకర్లలో ఈ సెగరెట్లు, వేప్‌లు, మద్యం సీసాలు, గంజాయి చాక్లెట్లు, సిగరెట్లు.. ఇలా అన్నింటిని తనిఖీ చేయాలని సూచించారు. జూనియర్ విద్యార్థులను బెదిరించి సీనియర్లు డ్రగ్స్, సిగరెట్లను స్మగ్లింగ్ చేయడానికి ఉపయోగిస్తారని, విద్యార్థుల వివరాలు బయటకు చెప్పమని తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే టీజీఏఎన్‌బీ కంట్రోల్ రూమ్ (8716271111)కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నార్సింగిలో హోర్డింగుల అక్రమ సంపాదన

ప్రతి నెలా రూ. 5 కోట్లు దోపిడీ

అధికారులు, ప్రజాప్రతినిధులే పాత్రధారులు

ప్రజా సొమ్ము.. పాలకుల జేబుల్లోకి..

ఇదీ నార్సింగి మున్సిపాలిటీ పాలనతీరు

మణికొండ, జూన్ 17: అభివృద్ధి మాట దేవుడెరుగు.. ప్రజల సొమ్ముతో చేసే అక్రమాల్లో మాకెంత.. మీకెంత.. అన్న పాలన మొదలైంది. అధికారులకు, ప్రజలకు వారధిగా నిస్వార్థంగా పని చేస్తామంటూ ప్రతిజ్ఞబూని.. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కొందరు స్వలాభమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలి.. స్వార్థ సంపాదనే ధ్యేయంగా ఆ మున్సిపాలిటీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు వ్యవహరిస్తున్న తీరిది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్రమ భవనాల గుర్తింపు.. ఆపై టౌన్‌ప్లానింగ్ అధికారుల ద్వారా నోటీసుల జారీ.. ఆ తర్వాత వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారంటూ ఆ పురపాలక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు భారీ హోర్డింగులను ఏర్పాటు చేయించి.. తిలాపాపం తలా పిడికెడు అన్నచందంగా లక్షలాది రూపాయల సంపాదనే ధ్యేయంగా పాలన కొనసాగిస్తుండటంపై సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. నార్సింగి మున్సిపాలిటీలో ఇప్పుడు హోర్డింగుల రాజకీయం కొనసాగుతున్నది. సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ప్రస్తుతం ఈ మున్సిపాలిటీ పరిధిలో భారీ హోర్డింగులు (క్యాండిలీవర్)-90, లాలీపాప్‌లు- 600 వరకు నార్సింగి నుంచి గండిపేట, శంకర్‌పల్లి చౌరస్తా, ఖానాపూర్ వరకు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేశారు. వీటి ద్వారా కనీసం ప్రతి నెలా రూ. 5కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా. ఈ హోర్డింగుల ద్వారా మున్సిపాలిటీ ఒక్క రూపాయి కూడా ఆదాయం సమకూరదు. ఎందుకంటే ఇవన్నీ కొంతమంది వార్డు కౌన్సిలర్లు, అధికారుల సొంత ఆస్తులుగా ప్రకటించుకుంటున్నారు. కొంతమంది వార్డు కౌన్సిలర్లు ఒక్కటి లేదా రెండు చొప్పున హోర్డింగులను పంచుకొని.. ఆపై అధికార పార్టీలోని అగ్రనేతలకు ఒకటి రెండింటిని కేటాయించి.. అందరు కలిసి నెలవారీగా లక్షలాది రూపాయల అద్దెలు వచ్చేలా సంపాదనకు కూర్పు చేసుకున్నారని ప్రజలంటున్నారు. ఈ హోర్డింగుల్లో కొన్ని అధికారులకు సైతం బినామీ పేర్లతో ఉన్నాయని తెలిసింది. అయితే, వీటిలో ఏ ఒక్కటి కూడా మున్సిపాలిటీ నుంచి అనుమతులు లేకుండానే కొనసాగిస్తున్నారు. కొన్ని హోర్డింగులు ఆర్ అండ్ బీ శాఖకు సంబంధించినవిగా ఆ శాఖ బోర్డులను ఏర్పాటు చేసి, ఆ శాఖలోని ఓ సీనియర్ అధికారి ఈ వ్యవహారాలను చక్కదిద్దుకుంటున్నట్లు తెలిసింది. ఆ శాఖలోని ఉన్నతాధికారులందరికీ ఈ హోర్డింగుల ద్వారా వచ్చే నెలవారీ అద్దెలను దాదాపు రూ. కోటి వరకు పంచుతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రజల సొమ్మును కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులంతా కుమ్మక్కై హోర్డింగుల జాతర కొనసాగిస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేసుకుంటున్నారని స్థానిక ప్రజలంటున్నారు. ప్రజాసమస్యలను గాలికొదిలి.. పట్టింపు లేకుండా విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధుల తీరు నార్సింగి మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది.

హోర్డింగులపై ఆ సంస్థ గురి..

గత కొన్నాళ్లుగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో భారీ హోర్డింగుల ఏర్పాటు విషయంలో ఓ సంస్థ ప్రతినిధి అన్ని హోర్డింగులను తమ వశం చేసుకోవాలని పైరవీలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సంస్థ హోర్డింగులు ఏర్పాటు చేసుకుని కోట్లాది రూపాయల వ్యాపారాలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. అయితే, నార్సింగి మున్సిపాలిటీలోనూ కొన్ని హోర్డింగులున్నా.. అవేకాకుండా మొత్తం తమ సంస్థకే కేటాయించేలా ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలతో పైరవీలు చేసుకుని ఇటీవల మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. ఈ సంస్థకు చెందిన ఇప్పుడున్న హోర్డింగులు ఎలాంటి అనుమతులు లేకుండానే కొనసాగిస్తుండటం గమనార్హం. ఇక్కడ అక్రమదారిలో కొనసాగుతున్న హోర్డింగులపై తమకు నెలవారీగా వస్తున్న ఆదాయంపై గండికొట్టేందుకు యత్నిస్తున్న ఆ సంస్థ ఆగడాలను మున్సిపాలిటీలో పారనీయకుండా చేయాలని కొంతమంది కౌన్సిలర్లు ప్రభుత్వంలోని పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది.

5కోట్ల ఆదాయం.. అంతా వారి జేబుల్లోకే..

నార్సింగి మున్సిపాలిటీలో అక్రమదారిలో కొనసాగుతున్న హోర్డింగుల వ్యవహారం ద్వారా ప్రతి నెలా మున్సిపాలిటీ ఖజానాలోకి వెళ్లాల్సిన దాదాపు రూ.5కోట్ల ఆదాయానికి గండికొడుతున్నట్లు సమాచారం. ప్రతి నెలా కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయని అధికారులకు తెలిసినా తిలాపాపం.. తలాపిడికెడు అన్నట్లుగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సకాలంలో స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల సొమ్ముతో అభివృద్ధి జరుగుతున్న మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కొంతమంది దళారీలు ప్రజా సొమ్మును అక్రమదారిలో బహిరంగంగానే దోచుకుంటున్నా ప్రశ్నించకపోవడంపై సర్వత్రా ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ ఉన్నతాధికారులు స్పందించి నార్సింగి మున్సిపాలిటీలో కొనసాగుతున్న హోర్డింగుల అక్రమ సంపాదనను మున్సిపాలిటీ ఆదాయంలోకి చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఓం శివదుర్గా జ్యోతిష్యం
★వీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. ఆఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085. NT-327846

WATER PROOFING
★సాయి బాలాజీ వాటర్ ప్రూఫింగ్: బిల్లింగ్, స్లాబ్, బాత్‌రూం, సైడ్‌వాల్స్, వాటర్ ట్యాంక్, సంప్, ఎనీ లీకేజ్, బ్రాండెడ్ కెమికల్స్‌తో, 10 సం॥ గ్యారంటీతో చేయబడును. Ph: 9121195558. NT-333884
★Srinivas Water Proofing Service: Specialist in Walls, Slab Crack Filling, Water Tank Leakage, Old & New Bathrooms, Cellar Pressure Grouting. Warranty for 5 yrs. We also do